క్లుప్తంగా

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలోని ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం

బిక్కవోలు: పందలపాకలోని తుల్యభాగనదీ తీరంలో కొలువైన సంతోషిమాత ఆలయ 17వ, అభయ ఆంజనేయస్వామి ఆలయ 32వ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు దుర్గవరపు రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి, మాజీ ఎంపీటీసీ దేవీశ్రీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, బొడ్డు వెంకట శ్రీను, బండారు అప్పారావు, తుమ్మూరి వెంకట రమణ, గొలుగూరి రామారెడ్డి పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లి సంబరం



బలభద్రపురంలో సత్తెమ్మ తల్లి గ్రామోత్సవం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలో సబ్బెళ్ల వారి ఇలవెల్పు సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు ఆకట్టుకున్నాయి. సబ్బెళ్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి తీర్థం



వడిశలేరులో వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట: వడిశలేరు గ్రామంలోని గూనపల్లివారి వీధిలో కొలువైన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు గూనపల్లి తిరుబాబు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిరూపంగా స్వర్గీయ అచ్చియ్యమ్మ ప్రతిష్ఠించిన విభూది పండుకు ప్రతి రోజూ పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తీర్థ మహోత్సవానికి స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక భజన మండలి సభ్యులు సామూహిక భజనలు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

మధురపూడి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. దురలవాట్లకు బానిసలైతే అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. సారా రహిత గ్రామంగా శ్రీరంగపట్నాన్ని తయారు చేయడానికి అందరూ సహకరించాలన్నారు. సీఐ సత్య కిషోర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనసరిగా డ్రైవింగ్ లైసెన్సులు పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్యామ్ సుందర్, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

బాలల ప్రగతికి బాసట

- 'పోషన్ బీ – పడాయి బీ' కార్యక్రమం అమలు
- అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణ అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)



అంగన్‌వాడీ కేంద్రంలో రంగులను గుర్తిస్తున్న పిల్లలు

రాజానగరం: నేటి బాలలే రేపటి పౌరులు. వారందరూ సంపూర్ణ ఆరోగ్యంతో పాటు విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత.. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులపై ఉంది. ఈ సమయంలో పాఠశాల విద్యకంటే ముందుగా చిన్నారులకు అడుగులు వేసే అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా అభివృద్ధి చేస్తూ, వాటిలోని బాలల విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందుకోసం జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా చిన్నారుల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం 'పోషన్ బీ, పడాయి బీ' అనే పథకాన్ని అమలు చేస్తోంది. ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ – ఈసీసీఈ)పై మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ పథకంపై అవగాహన కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిక్షణా బాధ్యతలను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఐపీసీసీడీ)కి అప్పగించారు.

పోషకాహారం, విద్యకు ప్రాధాన్యం

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం.. పిల్లలకు ఆరు సంవత్సరాల వయసులోనే 85 శాతం మెదడు అభివృద్ధిని సాధిస్తుంది. ఆ సమయంలో సరైన పోషణ, విద్యను అందించడం ఎంతో అవసరం. దీని కోసమే 'పోషణ్ బీ, పడాయి బీ' కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. పిల్లల శారీరక, అభివృద్ధి, సామాజిక భావోద్వేగ, నైతిక అభివృద్ధి, సాంస్కృతిక, కళాత్మక అభివృద్ధి, కమ్యూనికేషన్, మాతృభాష, అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

సమగ్ర అభివృద్ధి

నూతన విద్యా విధానాన్ని అనుసరించి అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యతతో కూడిన పోషకాహారం, మౌలిక సదుపాయాలు, ఆట పరికరాలను సమకూరుస్తూ, శిక్షణ పొందిన కార్యకర్తలతో మాతృభాషలోనే ఈసీసీఈ విధానాన్ని అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదల, శారీరక చలన, కండరాల అభివృద్ధితో పాటు మాట్లాడే విధానం (భాషాభివృద్ధి), వస్తువులను లెక్కించడం (గణితాభివృద్ధి), సాంఘిక, భావోద్వేగ అభివృద్ధి, రంగులను గుర్తించడం, బొమ్మలు వేయడం (సృజనాత్మకత) మున్నగు వాటి పనులు చేయించడంపై శిక్షణ ద్వారా అవగాహన కలిగిస్తున్నారు. జిల్లాలోని 1,556 అంగన్‌వాడీ కేంద్రాలలో మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు సుమారు 30,965 మంది వరకూ ఉన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారులలో పోషకాహార లోపాన్ని తగ్గించడంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధం తీసుకునేందుకు, సరైన వైద్య సేవలు అందించేందుకు 'పోషణ్ బీ, పడాయి బీ' కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుంది. చిన్నారులను బడికి సంసిద్ధులను చేయడానికి, వారి సంపూర్ణ అభివృద్ధికి కూడా తోడ్పడుతుంది. ముఖ్యంగా ఆరేళ్లలోపు చిన్నారులలో మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో వారికి అవగాహనతో కూడిన విద్య, ఎదుగుదలకు సరైన పోషణతో కూడిన ఆహారాన్ని అందించడం అవసరం. ఆట, పాటలతో విద్యను నేర్పడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతో అభివృద్ధిని సాధిస్తారు. ఈ పథకం అమలులో భాగంగా ప్రాజెక్టు అంగన్‌వాడీ కేంద్రాలలోని కార్యకర్తలకు అవగాహన కలిగిస్తూ, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం.

– టి.నాగమణి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, రాజానగరం

సోమనాథుని స్వర్ణ రథానికి పూజలు



ఊలపల్లికి చేరుకున్న సోమనాథుని రథం

బిక్కవోలు: సోమనాథుని స్వర్ణ దివ్య లింగ రథం ఆదివారం ఊలపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా రథానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మకుమారి కృష్ణవేణి మాట్లాడుతూ 2018 అక్టోబర్ 18వ తేదీన హిందూపురం సమీపంలోని గోరంట్ల గ్రామంలో రథయాత్ర ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి అనేక గ్రామాల్లో పర్యటిస్తూ ఊలపల్లి చేరినట్టు తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో బ్రహ్మకుమారిల ఆశ్రమానికి చేరుకుంటుందని, అనంతరం జి.మామిడాడ పరిసర గ్రామాల్లో యాత్ర కొనసాగుతుందన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించి, నైతిక విలువలను తీసుకురావాలని లక్ష్యంతో ఈ యాత్ర జరుగుతోందన్నారు. కార్యక్రమంలోని మాజీ సర్పంచ్ గేదెల సత్యనారాయణ, గేదెల వీరబాబు, గురుస్వాములు రొంగల శ్రీనివాసరావు, నెక్కల హరిబాబు, బ్రహ్మకుమారి శాంతి, సంధ్య, శివ, కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే



తోకాడ ర్యాలీలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు తదితరులు

రాజానగరం: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం 'మన భూమి, మన భవిష్యత్తు' పేరిట రీ సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.చిన్నరాముడు అన్నారు. మండలంలోని తోకాడలో రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలతో అనేక చోట్ల తగవులు, కొట్లాటలు జరుగుతూ, శాంతి భద్రతలకు భంగం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్, తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి, ఎంపీడీఓ జేపీ ఝాన్సీ, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ

రంగంపేట: జి.దొంతమూరు గ్రామంలో భూముల రీ సర్వేపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ రీ సర్వే కోసం కొలతలు తీసుకునే సమయంలో భూయజమాని అందుబాటులో ఉండి సరిహద్దులు నిర్ణయించే విషయంలో సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీఓ వీరసాయిబాబు పాల్గొన్నారు.

పాఠశాల దూరం.. చదువు భారం



శ్రీరంగపట్నంలోని యానాదుల పేట

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం శివారునున్న యానాదులపేటలో పాఠశాల ఏర్పాటు చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇక్కడ సుమారు 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరందరూ దాదాపు నిరక్షరాస్యులే. కానీ తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటున్నారు. ఈ కుటుంబాల్లోని సుమారు 25 మంది పిల్లలకు రెండు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళుతున్నారు. అయితే దూరం కావడంతో తరచూ మానేస్తున్నారు. శ్రీరంగపట్నం నుంచి గోకవరం మండలం అచ్యుతాపురం, వీరలంకపల్లి వైపున ఉన్న పంట చేలకు యానాదులు కాపలాగా ఉంటారు. వరి, మొక్కజొన్న తదితర పంటను కోతులు, ఇతర జంతువులు ధ్వంసం చేయకుండా కాపాడతారు. అలాగే చేపల పట్టుకుని, వాటిని అమ్ముకుని జీవనం సాగిస్తారు. అలాగే ఇటుక బట్టీల్లో పనిచేసుకుంటూ ఉంటారు. ప్రభుత్వం స్పందించి తమ ప్రాంతంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వాహనాల దారి మళ్లింపు

పెదపూడి: జి.మామిడాడలో రూ.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్న కారణంగా వాహనాలను గండ్రేడు సెంటర్ మీదుగా మళ్లిస్తున్నామని, దీనికి వాహన చోదకులు, ప్రజలు సహకరించాలని ఆర్‌అండ్‌బీ మండల ఏఈ లోవరాజు కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం – బిక్కవోలు అర్‌అండ్‌బీ రోడ్డులోని జి.మామిడాడ వద్ద ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో రామచంద్రపురం నుంచి బిక్కవోలు వైపునకు వెళ్లే వాహనాలు గండ్రేడు సెంటర్, గండ్రేడు, పెద్దాడ గ్రామం మీదుగా జి.మామిడాడలోని మార్కెట్ సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా వెళ్లవచ్చన్నారు.

ప్రతి నెలా అభిషేక పండగ

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరంలో ఎఫ్‌బీజీఎల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రతి నెలా మూడో బుధవారం అభిషేక ఆశీర్వాద పండగ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రెవరెండ్ రాజుజోషియా ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు స్వస్థత, ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు.

తాగునీటికి ప్రజల అవస్థలు



తాగునీటి సదుపాయం కల్పించాలని కోరుతున్న మహిళలు

రంగంపేట: సుభద్రంపేటలోని జగనన్న కాలనీ లేఅవుట్ – 1లో తాగునీటి సదుపాయం లేక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ దూర ప్రాంతం నుంచి నీరు తెచ్చుకుంటున్నామని వాపోయారు. గ్రామానికి దూరంగా కాలనీ ఉండడంతో నీటి కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పది కుటుంబాలు కాలనీలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు ఆంధ్రా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

- పూర్తయిన ఏర్పాట్లు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలకు సర్వం సిద్ధం



ఆలయంలో సాయిబాబా విగ్రహం



బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీసాయి ఆలయం

బిక్కవోలు: ఆంధ్రా షిర్డీ సాయిగా పేరు పొందిన బలభద్రపురంలోని సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం తెల్లవారుజాము 5.30 గంటలకు కాకడ హారతితో ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం గణపతి పూజ, గణపతి హోమం, దత్తాత్రేయ పూజ, ధుని పూజ నిర్వహిస్తారు. బాబావారి మూల విరాట్‌కు 108 లీటర్ల పాలతో అభిషేకం జరుపుతారు. భక్తులు కూడా తమ వెంట ఆవు పాలు తెచ్చుకుని బాబావారికి అభిషేకం చేసుకోవచ్చు. 8 గంటల నుంచి లక్షప్రతి పూజ, చక్ర రూప రాజరాజేశ్వరీదేవికి లక్ష కుంకుమపూజ, గోపూజ, హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన జరుగుతుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి బాబావారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రికి బాబా మందిరం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పునరుత్పాదక వనరులు వినియోగిద్దాం



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్, ఉద్యోగులు

- ఓఎన్‌జీసీ ఎసెట్ ఈడీ శాంతానుదాస్
- ఉత్సాహంగా వాక్‌థాన్

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ అనుకూల పరిశుభ్రమైన పునరుత్పాదక వనరులను వినియోగించుకుంటూ భావితరాలను కాపాడుకుందామని ఓఎన్‌జీసీ రాజమండ్రి ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శాంతానుదాస్ అన్నారు. హరిత, స్వచ్ఛమైన శక్తి ద్వారా పరిశుభ్రమైన పర్యావరణాన్ని సాధిద్దామనే అనే నినాదంతో ఆదివారం గెయిల్ కార్యాలయం నుంచి ఓఎన్‌జీసీ రాజమండ్రి ఎసెట్ కార్యాలయం వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శాంతానుదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరుల వినియోగం పెరుగుతుండడంతో భవిష్యత్తులో వాటి కొరత తీవ్రంగా ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వ ఇంధన వనరులశాఖ 2030 నాటికి 500 గెగావాట్ల పునరుత్పాదక ఇంధనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా ఓఎన్జీసీ పది మెగా వాట్ల ఇంధన సామర్థ్యాన్ని పెంచుకుంటుందన్నారు. రాజమండ్రి ఎసెట్ పరిధిలోని తాటిపాకలో ఇప్పటికే సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నామన్నారు. పర్యావరణ అనుకూల ఇంధన వినియోగంలో భాగంగా పవన విద్యుత్తును కూడా వినియోగంలోకి త్వరలో తీసుకు వస్తున్నట్లు తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు అసెట్ పరిధిలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీసి ఉద్యోగులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, కేంద్రియ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

వీరభద్రుని ఆలయానికి దారేది!

- పట్టిసీమకు వెళ్లే మార్గంపై స్పష్టత కరవు
- ఇంకా నిర్ధారణ కాని వైనం
- వంగలపూడి రేవు వద్ద నీటి ప్రవాహం
- రామచంద్రపురం నుంచి అనుకూలం



వంగలపూడి ర్యాంపు వద్ద గోదావరిలో నీటి ప్రవాహం

సీతానగరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏలూరు జిల్లా పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దర్శనానికి మన జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళతారు. వీరి కోసం సీతానగరం మండలం వంగలపూడి, రామచంద్రపురం నుంచి గోదావరిలో దారి ఏర్పాటు చేస్తారు. అయితే శివరాత్రి సమీపిస్తున్నప్పటికీ ఇంకా దారి ఎటు అనేది నిర్ధారణ చేయలేదు. ఏటా వంగలపూడి ర్యాంపు నుంచి సుమారు లక్ష మంది, రామచంద్రపురం నుంచి 30 వేల మంది పట్టిసీమకు వెళుతుంటారని అంచనా.

వంగలపూడి నుంచి దారి లేదు

ఈ ఏడాది వంగలపూడి ర్యాంపు నుంచి దారి వేయడానికి పరిస్థితి అనుకూలంగా లేదు. ఈ ప్రదేశంలో గోదావరిలో నీరు ఎక్కువగా ఉంది. గతేడాది ఇక్కడ నీరు తక్కువగా ఉండడంతో వంగలపూడి ర్యాంపు నుంచి గోదావరిలో తూరలు వేసి, పైన ఇసుకతో కప్పి నడక మార్గం ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం ఆరు కిలోమీటర్లు ఉంటుంది. ఈసారి గోదావరిలో నీట్టి మట్టం ఎక్కువ ఉండటంతో గూటాల దగ్గరలోని లంక వద్ద మార్గం ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. అయితే దీని వల్ల ఆలయానికి దూరం పది కిలోమీటర్లు పెరుగుతుంది. ప్రతి ఏడాదీ భక్తుల నుంచి చార్జీలు వసూలు చేసి ట్రాక్టర్లపై ఆలయం వద్దకు తరలిస్తుంటారు.



రామచంద్రపురం వద్ద అనుకూలంగా ఉన్న మార్గం

కేవలం మూడు కిలోమీటర్లే..

పురుషోత్తపట్నం పంచాయతీ రామచంద్రపురం రేవు నుంచి భక్తుల తరలివెళ్లడానికి నడక మార్గం సిద్ధంగా ఉంది. ఇక్కడ గోదావరిలో నీరు లేదు. ఈ ఏడాది పాటిరేవు పడటంతో భక్తులు తరలివెళ్లడానికి అనువుగా ఉంది. ఇక్కడ నుంచి వీరభద్రుని ఆలయం కేవలం మూడు కిలోమీటర్లు దూరం ఉంటుంది.

అధికారుల నిర్ణయమేమిటో!

రెండు రేవుల నుంచి వీరభద్రుని ఆలయానికి దారెటు అనేది అధికారులు నిర్ణయించాల్సి ఉంది. వంగలపూడి ర్యాంపు నుంచి అయితే లక్షల రూపాయలు ఖర్చు చేయాలి. అలాగే సైకిళ్లు, మోటారు సైకిళ్లు, కార్ల స్టాండ్, ట్రాక్టర్లపై భక్తులను తరలించడానికి బహిరంగ వేలం పాట నిర్వహించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. గోదావరిలో నీరు ఉండటంతో వంగలపూడి ర్యాంపు నుంచి భక్తులకు నడక మార్గం లేకుంటే పంచాయతీకి ఆదాయం ఉండదు. రామచంద్రపురం నుంచి అయితే నిధుల ఖర్చు చేయాల్సి పనిలేదు.

అక్రమంగా ఆవుల తరలింపు

రాజమహేంద్రవరం రూరల్: అక్రమంగా 50 ఆవులను తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బొమ్మూరు ఎస్సై అంకారావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రాత్రి దివాన్ చెరువు జీరోపాయింట్ వద్ద బొమ్మూరు ఎస్సై అంకారావు, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అటుగా వెళుతున్న వ్యాన్‌ను పరిశీలించగా, దానిలో 50 ఆవులు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆవులను గోశాలకు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డీఎస్‌ఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేవలం 28 రోజులు మాత్రమే సమయం ఉందని, దీన్ని చక్కగా వినియోగించుకున్నవారే విజేతలుగా నిలుస్తారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ జరిగిన అన్ని పరీక్షల్లో ఏయే అంశాల్లో మార్కులు తగ్గుతున్నాయో చూసుకుని, ఉపాధ్యాయులతో సందేహ నివృత్తి చేసుకుని నూరు శాతం మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ 28 రోజులూ ఆటపాటలకు, సామాజిక మాధ్యమాల్లో చాటింగ్‌లకు స్వస్తి పలకాలన్నారు. నిరంతరం చదువుకే సమయాన్ని వెచ్చించాలని, అదే సమయంలో ఆరోగ్యంపై కూడా అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. సెలవుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల విద్యార్థులకు బడిలో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారన్నారు.